క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణం



వాల్మీకిపురం : స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో శనివారం శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి సేవా కార్యక్రమాలు మొదలుపెట్టారు. స్వామి వారికి అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర కార్యక్రమాల అనంతరం విశేష అలంకరణలో ముస్తాబైన ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో సంప్రదాయ బద్ధంగా తీసుకెళ్లి ఆశీనులను చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ సీతారాముల కల్యాణం వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

తంబళ్లపల్లె : మండలంలో సీజనల్ వ్యాధులు, జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోసువారిపల్లె పీహెచ్‌సీ వైద్యులు మునికుమార్ అన్నారు. మెడికల్ ఆఫీసర్ అనుపమ ఆధ్వర్యంలో శనివారం కోటకొండ యూపీ స్కూల్‌లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జలుబు, దగ్గు, జ్వరం ఉన్న విద్యార్థులకు వైద్యం చేసి, మందులు అందజేశారు. అనంతరం విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఇంటి పరిసరాల శుభ్రత, నీటి నిల్వలేకుండా చేస్తే దోమల నివారణ సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు,హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఉమర్‌ఫరూఖ్

తంబళ్లపల్లె : స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో డిసెంబర్ 9వ తేదీ జరిగే లోక్ అదాలత్‌లో ఇరువర్గాల రాజీ మేరకు ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు పోలీసు అధికారులు కృషి చేయాలని మండల న్యాయసేవ అధ్యక్షుడు, న్యాయమూర్తి ఉమర్‌ఫరూఖ్ సూచించారు. శనివారం కోర్టులో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. కోర్టు పరిధిలోని తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పోలీసులు లోక్ అదాలత్ కార్యక్రమంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ములకలచెరువు ఎక్సైజ్ సీఐ మల్లిక, ఎస్‌ఐలు లోకేష్‌రెడ్డి, రామాంజనేయుడు, గాయత్రి, రవి, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.


టీ 20 క్రికెట్ జట్టు ఎంపిక



టీ20 జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో అద్వైత్

కలకడ : జిల్లా టీ20 క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్లు టీ20 క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.అద్వైత్ తెలిపారు. శనివారం కలకడ క్రికెట్ క్రీడా మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఎం. కిరణ్‌కుమార్, కె.సాయితేజ, టి.కుమార్‌రెడ్డి, జబీర్, హర్షవర్ధన్, జయంత్‌కుమార్, మునిరత్నంనాయుడు, టి.హేమచరణ్, సయ్యద్ రియాజ్, లోకేష్, రామ్మోహన్, కె.రాజేష్, బావాజాన్, చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నారు. ఈనెల 10నుంచి 12 వరకు ఆగ్రాలో జరిగే క్రికెట్ టోర్నమెంట్‌లో వీరు పాల్గొంటారని తెలిపారు.

త్రిపుర గవర్నర్‌ను కలిసిన పీలేరు ఎమ్మెల్యే



గవర్నర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం : త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని శనివారం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తిరుపతి పద్మావతి గెస్ట్ గౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 1985–89 మధ్య కాలంలో ఇంద్రసేనారెడ్డి మలక్‌పేట ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తాను కూడా ఎమ్మెల్యేగా ఉన్నానని, అప్పటి నుంచి మంచి స్నేహపూర్వక సంబంధం ఉందన్నారు. ఆయన త్రిపుర గవర్నర్ కావడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చింతల ఆనంద రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గడప గడపకు సంక్షేమం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గడప గడపకు సంక్షేమం చేరుతోందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని మహల్ గ్రామ సచివాలయ పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహల్‌లో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రతి ఇంటికి నేరుగా అందిన సంక్షేమ లబ్ధి వివరాలతో కూడిన బుక్‌లెట్ అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా ప్రతి ఇంటికి లబ్ధి చేకూరుస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని బలపరిచి మరోసారి గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఉద్యోగ సదుపాయం, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, డ్రైనేజీ కాలువలు, తాగునీటి కుళాయిలు, విద్యుత్ స్థంభాల ఏర్పాటు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, సర్పంచ్‌లు తస్లీమ రియాజ్ అహ్మద్, గంగయ్య, వెంకటరెడ్డి, ఎంపీటీసీ సావిత్రి ప్రదీప్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా, మండల ప్రత్యేక ఆహ్వానితుడు శివాజీ, ఉప సర్పంచ్ అన్సర్, స్థానిక నాయకులు ఆరిపుల్లా, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన గడపగడపకు మన ప్రభుత్వం హామీ



కాలువ నిర్మాణం పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీదేవి తదితరులు

కలకడ : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ కె.మాదిగపల్లెలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో డ్రైనేజీ కాలువ నిర్మాణం చేపట్టారు. శనివారం ఎంపీపీ శ్రీదేవి కాలువ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. గ్రామాలలో మంచినీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీలో కనీస సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేంద్ర, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ చరిస్మాంజలి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవికుమార్, గోపాల్, మాతంగ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం



జగనన్న ఆరోగ్యసురక్ష మెడికల్ కిట్‌లు అందిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ తదితరులు

మదనపల్లె : పేద ప్రజలకు ఇంటివద్దకే మెరుగైన ఉచిత వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం తీసుకువచ్చిన జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం కలగనుందని మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి, అన్నమయ్యజిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎస్.ఏ.కరీముల్లా అన్నారు. శనివారం పట్టణంలోని 14వవార్డు సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో పరీక్షలు చేయించుకోవడం వల్ల వ్యాధులను ముందుగానే గమనించి, వ్యాధి తీవ్రమవకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, ఏఈ బండపల్లి శిరీషా, కౌన్సిలర్ షేక్‌షబానా, పాల్‌చంద్రశేఖర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో పాల్గొన్న వ్యాయామ ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ : వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏపీ రెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న డీఎస్సీలో 3 వేల పీఈటీ పోస్టులు ఇవ్వాలని, ఎంపీఎడ్ ఉన్న పీడీలకు జూనియర్ కాలేజీ, ప్లస్ టూ స్కూల్స్‌లో జూనియర్ కాలేజీ లెక్చరర్‌గా ఇవ్వాలన్నారు. సమస్యలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంత, జిల్లా ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ కన్వీనర్ నరేష్‌బాబు, పీడీలు దేవకమ్మ, లత, భారతి తదితరులు పాల్గొన్నారు.


మిట్స్‌లో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

కురబలకోట : మదనపల్లె దగ్గరున్న మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో చదివి దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో రాణిస్తున్న పూర్వ విద్యార్థులు శనివారం కళాశాలలో కలుసుకున్నారు. కాలేజి డేస్‌ను తలచుకుని ఆనందంగా గడిపారు. ఆడారు.. పాడారు.. సందడి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ మాట్లాడుతూ మిట్స్ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ నలుమూలలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ఐటీ సంస్థల్లో ఉన్నత స్థానాల్లో కొనసాగుతున్నారన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి భారత రక్షణ సంస్థ (డీఆర్‌డీఓ)లో పని చేస్తున్న సైంటిస్టు సుష్మ మాట్లాడుతూ 1998 నాటి టెక్నాలజీకి 2023లోని టెక్నాలజీలో ఎంతో ఆధునికత చోటుచేసుకుందన్నారు. ఇంటర్నెట్ వాడకం కెరీర్‌ను నిర్దేశిస్తుందన్నారు. క్రమశిక్షణతో మెలిగే వారికి ఏ రంగంలోనైనా ఎదురు లేదన్నారు. జీవితంలో గుర్తుండే రోజులు విద్యార్థి దశవేనన్నారు. ఎదిగిన తర్వాత ఎంత సంపాదించినా ఎంత స్థాయికి చేరుకున్నా చదువుకున్న రోజుల నాటి సంతోషం తిరిగి రాదన్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

వైద్య విధానపరిషత్ కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గిరిబాబు

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్(ఏపీవీవీపీ)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను తక్షణమే పర్మినెంట్ చేయాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.గిరిబాబు డిమాండ్ చేశారు. శనివారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్, ఏఐటీయూసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేస్తున్న వైద్య కళాశాలల్లో పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయాలన్నారు. 12వ పీఆర్సీకి ఏడాది సమయం ఉన్నందున ఇంటీరియం రిలీఫ్ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సరోజ, ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి వెంకటేష్, శ్రీనివాసులు, రమణమ్మ, విజయలక్ష్మి, ఉమాపతి, జానకిరాం, జ్ఞానేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విరివిగా క్షేత్ర దినోత్సవాలు నిర్వహించాలి



వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేస్తున్న విశ్వవిద్యాలయ సంచాలకుడు

కలికిరి : కేవీకే ఆధ్వర్యంలో రైతులకు క్షేత్ర దినోత్సవాలు నిర్వహించాలని ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకుడు డాక్టర్ సుబ్బిరామిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక కేవీకేను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులను రైతులతో ప్రయోగాత్మకంగా సాగు చేయించాలన్నారు. పంట కోత సమయంలో మిగిలిన రైతులకు క్షేత్ర దినోత్సవం నిర్వహించాలని సూచించారు. జీవన ఎరువులు, లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలు, మామిడి ఫ్రూట్ కవర్స్ తదితరాలు కేవీకేలో రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా రైతులకు టీసీజీఎస్–1694 రకం వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తర్ణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గురువారెడ్డి, కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల నిర్ణయం హర్షణీయం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

మదనపల్లె : రాష్ట్రంలో పనిచేస్తున్న అక్రిడేటెడ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలను ఇవ్వాలన్న రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయం హర్షణీయమని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండపల్లి అక్కులప్ప అన్నారు. శనివారం ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో...ముఖ్యమంత్రికి, రాష్ట్ర మంత్రిమండలికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

బి.కొత్తకోట : జర్నలిస్టులకు ఇంటిస్థలాల కేటాయింపుపై హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో బి.కొత్తకోట జర్నలిస్టులు శనివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

ఉరుసు పోస్టర్ల ఆవిష్కరణ

పీలేరు : పీలేరు పట్టణంలోని కట్టుకాలువ వీధిలో ఈ నెల 6 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఉరుసే షరీఫ్ కార్యక్రమానికి పంచాయతీ రాజ్ జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ హబీబ్‌బాషా పది బస్తాల బియ్యం వితరణగా అందజేశారు. అలాగే ఉరుసుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న రాత్రి గంధం ఊరేగింపు, 7న ఉరుసు కార్యక్రమం, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మహమ్మద్ ఖాసీం, డీసీసీబీ డైరెక్టర్ మస్తాన్, మండల కోఆప్షన్ సభ్యుడు రెడ్డిబాషా, ఎంపీటీసీ జోహార్, కాలేషా, శ్రీనాథరెడ్డి, జయపాల్‌రెడ్డి, నాగరాజనాయక్, పెద్దోడు, మునీర్, జహంగీర్, మోహన్, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

మదనపల్లె : రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సౌజన్యంతో, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాలకు చెందిన 111 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రజల అవసరాల కోసం నిరంతరం రక్తదాన శిబిరాలు కొనసాగాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి పాథాలజీ డాక్టర్ భార్గవ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున, డిప్యూటీ మేనేజర్ శ్రీధర్, ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, ఎన్‌ఎస్ఎస్ కోఆర్డినేటర్ మునీంద్రనాయక్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడాలి




ఓటరు నమోదు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ

వాల్మీకిపురం : ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు, సిబ్బందిపై ఉందని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. శనివారం స్థానిక పీవీసీ ప్రభుత్వ పాఠశాలలో కొత్త ఓటర్లు, ఓటర్ల సవరణ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబితాలో మృతులు ఉంటే తొలగించాలన్నారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, వీఆర్‌ఓలు సుధాకర్, సౌజన్య, రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

సవరణల కోసం ప్రత్యేక శిబిరం

రామసముద్రం : రామసముద్రం మండలం చెంబకూరు గ్రామ పంచాయతీ కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో 2023–2024 సంవత్సరానికి సంబంధించిన ఓటర్ల జాబితాలో సవరణల కోసం శనివారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం రెండు రోజుల పాటు బీఎల్‌ఓల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ దైవరాజన్ తెలిపారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓ శేఖర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఏమైనా పొరపాట్లు ఉన్నా, చేర్పులు, మార్పులు ఉంటే సరిచేసుకునేందుకు ఈ ప్రత్యేక శిబిరాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు రేవతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగళ్లు హైస్కూల్‌లో సరస్వతి విగ్రహం ఆవిష్కరణ



సరస్వతి విగ్రహం ఆవిష్కరణ దృశ్యం

కురబలకోట : మండలంలోని అంగళ్లు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో శనివారం చదువుల తల్లి సరస్వతి విగ్రహం ఆవిష్కరించారు. టీమ్ ద్వార కనాథరెడ్డి వ్యవస్థాపకులు శంకర్ రెడ్డి రామిగాని, క్రియాశీలక సభ్యులు అజారుద్దీన్, ఆర్పీకే వెంకటేశ్వర్ రెడ్డి, చిటికి మధుకర్ రెడ్డి రూ. లక్ష వ్యయంతో తొలుత ఆలయాన్ని నిర్మించారు. స్థానిక సర్పంచ్ పోరెడ్డి విశ్వనాథరెడ్డి, నాటి స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ అమ్మాజీ రూ. 35 వేలు వ్యయంతో సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. శనివారం దీన్ని ఆవిష్కరించారు. జెడ్పీటీసీ బైసాని జ్యోతి, ఎంపీపీ దస్తగిరి, బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి, ఎంఈఓ ద్వారకనాథ్, హెడ్మాస్టర్ ఎస్.నాగలక్ష్మి, కన్నెమడుగు హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.మదన్ మోహన్, వాసుదేవ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో జోనల్ లెవల్ హాకీ టీం ఎంపిక



సౌత్‌జోన్ హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కలికిరి : జేఎన్‌టీయూ అనంతపురం యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి జోజిరెడ్డి ఆధ్వర్యంలో కలికిరి జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ బాల, బాలికల హాకీ టీంలను శనివారం ఎంపిక చేశారు. యూనివర్సిటీ పరిధిలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి సుమారు 70 మంది క్రీడాకారులు పోటీలలో పాల్గొనగా వీరిలో 16 మంది బాల, బాలికలను ఎంపిక చేశారు. ఎంపికైన టీం సభ్యులు తమిళనాడు రాష్ట్రం తిరిచునాపల్లిలోని భారతీదాసన్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ హాకీ పోటీలలో పాల్గొంటారన్నారు. స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులు పరమేష్, రమేష్, రంగ ప్రసాద్, కలికిరి కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ త్యాగరాజన్, పీడీ శ్రీరాములు, అసిస్టెంట్ పీఈటీ సునీత పాల్గొన్నారు.

టపాసుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి, డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : ప్రభుత్వ నిబంధనల మేరకే బాణాసంచా విక్రయాలు జరపాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి, డీఎస్పీ కేశప్ప తెలిపారు. స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో శనివారం డివిజన్‌లోని తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, టపాకాయల విక్రేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టపాకాయల దుకాణదారులు అధిక ధరలకు విక్రయించకుండా, దుకాణాల ఎదుట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిషాపు వద్ద నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకుని, ఫైర్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌ల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. మదనపల్లె డివిజన్‌లో మొత్తం 65 షాపులకు దరఖాస్తులు పెట్టుకుంటే, అందులో మదనపల్లె పట్టణంలో 32 షాపులు ఉన్నాయన్నారు. వీటన్నింటినీ ఒకే ప్రాంతంలో కాకుండా ప్రజల సౌకర్యార్థం రెండుచోట్ల ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. అలాగే మండల స్థాయిలో ఎక్కడెక్కడ దుకాణాలు ఏర్పాటు చేస్తారో డివిజన్ కార్యాలయానికి నివేదిక పంపాలన్నారు. బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసేవారు ప్రతి దుకాణానికి మధ్య 3 మీటర్లు దూరం ఉండాలని, గ్రీన్ క్రాకర్స్ మాత్రమే విక్రయించాలన్నారు. ఏవైనా పొరపాట్లు జరిగితే నష్టం తీవ్రత అధికంగా ఉంటుంది కనుక సురక్షిత ప్రదేశాల్లో విక్రయాలు జరపాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, రామసముద్రం, నిమ్మనపల్లె తహసీల్దార్‌లు దైవరాజన్, సి.ఆర్.మంజుల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సబ్రీన్ ముక్తియార్ తదితరులు

గుర్రంకొండ : విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని జెడ్పీటీసీ సబ్రీన్ ముక్తియార్ అన్నారు. శనివారం స్థానిక ఉర్దూ జెడ్పీహైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు హాజరు పట్టికను పరిశీలించి మొత్తం 310 మంది విద్యార్థులకు 197 మంది మాత్రమే హాజరు కావడాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 25.550 కేజీల బియ్యాన్ని వండాల్సి ఉండగా కేవలం 12 కిలోల వరకే భోజనం తయారు చేయడంపై మండిపడ్డారు. విద్యార్థులకు ఇచ్చిన ప్రభుత్వ బియ్యాన్ని పాఠశాలలో స్టాకు ఉంచకుండా ప్రైవేట్ వ్యక్తుల ఇళ్లలో ఉంచడంపై హెడ్మాస్టర్‌ను ప్రశ్నించారు. ఇకమీదట ఇలాంటి పనులు మానుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని డీఈఓ దృష్టికి తీసుకెళ్లినట్లు జెడ్పీటీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ మహమ్మద్ గౌస్, మండల పార్టీ కన్వీనర్ ముక్తియార్ అలీఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైనార్టీ విద్యార్థినులు చదువులో రాణించాలి

మైనార్టీ విద్యార్థినులు చదువులో రాణించాలని జెడ్పీటీసీ సబ్రీన్ ముక్తియార్ అన్నారు. శనివారం స్థానిక ఉర్దూ హైస్కూల్లో మైనార్టీ విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల వలన ఎన్నో అనర్థాలు వస్తాయన్నారు. వీటిని అరికట్టేందుకు అందరూ సహకరించాలన్నారు. బాలికల చదువుతో కుటుంబ వ్యవస్థ బలపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ : ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం డిపోలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి సోమవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన తంబళ్లపల్లె మల్లయ్యకొండకు రెండు బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. మదనపల్లె నుంచి ఉదయం 5.30, 7.30 గంటలకు బయలుదేరుతాయన్నారు. తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసులు నడుపుతామన్నారు. అలాగే ప్రముఖ పర్యాటక కేంద్రమైన తిమ్మమ్మ మర్రిమాను మీదుగా కదిరికి మదనపల్లె నుంచి తంబళ్లపల్లె మీదుగా బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. మదనపల్లె నుంచి ప్రతి రోజు ఉదయం 7.50, 9.40, మధ్యాహ్నం 1.45లకు, తంబళ్లపల్లె నుంచి కదిరికి ఉదయం 5.15, 9.20, 11, సాయంత్రం 3 గంటలకు బయలుదేరుతాయన్నారు. కదిరి నుంచి తంబళ్లపల్లెకు ఉదయం 8.15, 12.30, మధ్యాహ్నం 2.45, సాయంత్రం 5.45కు బస్సు సర్వీసులు ఉన్నాయన్నారు. పర్యాటకులు,భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.